క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు



దాచేపల్లి : మండలంలోని పొందుగల గ్రామంలో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బిలాలు మసీద్‌లో ట్రస్ట్ వ్యవస్థాపకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉన్న ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్‌లో డాక్టర్ శ్రీనివాసరావు అన్నం వడ్డించారు. డాక్టర్ శ్రీనివాసరావును ముస్లిం మతపెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాముల వారికి పుష్పయాగం



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలో వేంచేసియున్న శ్రీకోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ స్వామి వార్లకు ఆదివారం 16వ రోజు పండుగను పురస్కరించుకుని పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విడేల సుందరరావు, కార్యదర్శి చిల్లంచర్ల సత్యనారాయణ, ట్రెజరర్ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు, పుష్పయాగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందించారు. ఉత్సవ విగ్రహాలతో రాత్రి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

గురజాల : భూసార పరీక్షలపై రైతులు అవగాహన కలిగివుండాలని వ్యవసాయాధికారిణి సంధ్యారాణి సూచించారు. ఈ సందర్భంగా ఆర్బీకే కేంద్రాల్లో సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ రైతు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని. రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏలు, ఏఈఓలు భూసార పరీక్షలు చేయించుకుంటే రైతులకు కలిగే ప్రయోజనాలు గురించి రైతులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులే శాస్త్రవేత్తలుగా ఎదగాలనే సంకల్పంతో వ్యవసాయంలో పలు సంస్కరణలు తీసుకు రావడం జరిగిందన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గురజాల : భార్గవి హాస్పిటల్ పాలీ క్లీనిక్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశాలలో ఆదివారం ఉదయం ఎటువంటి ఫీజు లేకుండా బి.పి, షుగర్, ఇసీజీ పరీక్షలు నిర్వహించి ఏమైనా వ్యాధితో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారుగా 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది. వైద్య శిబిరంలో వైద్యులు కె.పి చారి, వై శ్రీహర్ష, బాలకాశి, ఎస్ పద్మావతి, సి అరుణ్‌కుమార్, వి సుధీర్‌లు తమ సేవలు అందించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పిడుగురాళ్లరూరల్: మండలంలోని కరాలపాడు గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, శాసన మండలి ప్రభుత్వ విఫ్ జంగా కృష్ణమూర్తిలు హాజరు అవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొన్నాలని ఆయన తెలిపారు.

జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం



మా నమ్మకం నువ్వే జగనన్న ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు

దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, పార్టీ గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు పర్యవేక్షణలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల వల్ల జరిగిన లబ్ధి గురించి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. నగర పంచాయతీతో పాటుగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన విజయ్‌కుమార్, షేక్ ఖాదర్‌భాషా, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని 29వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులు నట్టువ రాధాకృష్ణ ఆధ్వర్యంలో గృహసారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి, సీఎం జగన్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను తేడాను ప్రజలకు వివరించారు. సీఎం జగన్ నిరంతరం రాష్ట్రాభివృద్ధికి పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను తిరిగి గెలిపించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలందించారన్నారు. కార్యక్రమంలో గృహసారథులు ముక్కాల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని ఎస్సీ కాలనీలో కన్వీనర్, గృహసారథులు ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ప్రతి ఇంటింటికి తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, ఇంటి వద్దకే చేరుస్తూన్నారన్నారు. ప్రతి ఒక్కరికీ అభివృద్ధి పథకాల గురించి వివరిస్తున్నారు. సీఎం జగన్‌కు మద్దతుగా అందరూ నిలవాలన్నారు. కౌన్సిలర్ వేల్పుల గురవయ్య విజయ మేరి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అన్నంరాజు వెంకటరమణ, గోపాలుని శ్రీనివాసరావు, కందుకూరి రత్నరాజు, కంభంపాటి మోషే, వేల్పుల యేసుదాసు, రాంబాబు, మధిర నాగలక్ష్మి, మధిర మల్లేశ్వరి, కంభంపాటి భాస్కర్‌రావు, యరసాని నాగేశ్వరరావు, పోలేపల్లి ఆనంద్, గెల్లిపోగు సామేలు, ఆలేటి సామేలు, కొమ్ము కుమారి, కోట ముత్తమ్మ, కోకా సుబ్బారావు, సుగుణమ్మ, రత్నమ్మ, కొమ్ము పేరమ్మ, ఏసమ్మ తదితరులున్నారు.

కారెంపూడి: గడిచిన నాలుగేళ్ల కాలంలో దాదాపు ప్రతి కుటుంబానికి ఏడాదికి సగటున లక్షకు పైగా ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని పేదలు ఎవరూ కూడా డబ్బుకు కాని జీవనానికి కాని ఇబ్బంది పడిన పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేశారని, ఇంకా మీరు జగనన్నకు అండగా ఉంటే పేదల జీవితాలు ఇంకా మెరుగు పడతాయని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రజలకు వివరిస్తున్నారు. కారెంపూడిలో ఆదివారం సాయంత్రం కూడా మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని కారెంపూడి పట్టణంలో నాలుగు ప్రాంతాల్లో మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. ముఖ్యమంత్రి గారు మాకు మేలు చేస్తున్నారయ్యా..మళ్లీ మేము జగనన్నకే ఓటేస్తామని ప్రజలు మద్దతు ప్రకటిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ షేక్ షఫీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వర రెడ్డి, పాతూరి రామిరెడ్డి, ఎంపీటీసీలు అంతరగడ్డ ఏసోబు, షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టనంలోని 33 వార్డుల్లో ఆయా కౌన్సిలర్లు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా 6వ వార్డులో కౌన్సిలర్ అజ్మిర శారద ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వలంటీర్లకు అందించిన కరపత్రాలను అందజేశారు. అదేవిధంగా 27వ వార్డులో కౌన్సిలర్ అన్నెం పద్మావతి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు గతం కంటే ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేయటం ఎంతో సంతోషంగా ఉందని చెబుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, వాలంటీర్లు, గృహసారధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం జగనన్న స్టిక్కర్లను అంటిస్తున్న గృహసారథులు



తక్కెళ్లపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



తోట బజారులో ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు



6వ వార్డులో మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కౌన్సిలర్లు, వలంటీర్లు

ఘనంగా మద్దిరాలమ్మ తిరునాళ్ల

పిడుగురాళ్లరూరల్: కోరికలు తీర్చే బంగారు తల్లి మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో వెంచేసియున్న మద్దిరాల తల్లి దేవాలయంలో ఆదివారం తిరునాళ్లను నిర్వహించారు. దీనిలో భాగంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి కుంకుమ పూజలు, పాలాభిషేకం, గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ తిరునాళ్లకు విచ్చేసిన గ్రామస్తులు దేవాలయంకు చేరుకొని పొంగళ్లు, ముడుపులు చెల్లించారు. తిరునాళ్ల చూసేందుకు వచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాదినబోయిన వెంకటేశ్వర్లు, ఓబులయ్య, లక్ష్మయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో మద్దిరాలమ్మ

ఉచిత పాలీసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్

పిడుగురాళ్ల: పట్ణంలోని 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఎస్ఎఫ్:, యూటీఎఫ్, డీవైఎఫ్, జెవివి ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జి. విజయసారధి అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్, ఏపీఆర్‌జేసీ సంబంధించి ఆన్‌లైన్ అప్లికేషన్ కూడా ఈ నెల 18వ తేదీ నుంచి యూటీఎఫ్ కార్యాలయంలో చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. విద్యార్థులు టెక్నికల్ గ్రూపుల వైపు అడుగులు వేస్తే త్వరగా జీవితంలో సెటిల్ అవ్వొచ్చునని ఆయన తెలియజేశారు. ఈ అవకాశాన్ని 10త తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు. వివరాలకు ఎంవీ సాంబశివరావు 9949934068, ఆంజనేయులు 9573067224, కోట సాయికుమార్ 7799334980 నెంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

19న బహిరంగ వేలం

మాచవరం: జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు మండల పరిధిలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 19న ఉదయం 10 గంటలకు మాచవరం పోలీస్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. వివిధ అక్రమ కేసుల్లో పట్టుబడిన ఒక కారు, ఒక ఆటో, తొమ్మిది ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వేలంలో పాల్గొనాలని తెలియజేశారు.

నాటక రంగ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని ఆదివారం నరసరావుపేట రంగస్థలి, శ్రీనరసరావుపేట కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు మాట్లాడుతూ, ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి సాంఘిక నవల, నాటకం రాజశేఖర చరిత్ర రాసిన నాటకకర్త, దర్శకుడు, ప్రదర్శనకారుడు వీరేశలింగం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు షేక్.బాజీ, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.అయ్యపరాజు, ఎ.ఎ.మధుకుమార్, కె.ఆర్.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అప్రమత్తంగా ఉండాలి

వినుకొండ టౌన్: అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం పట్టణంలోని పున్నమి టవర్స్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు మహిళలకు అవగాహన సదుస్సు నిర్వహించారు. వంట చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలిండర్ లీకేజీ, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీఎస్ఎఫ్ ఎం. శ్రీనివాసరావు, డీటీపీ రమణారెడ్డి, ఎల్ఎఫ్‌లు డి.ప్రకాష్‌రావు, ఎ.వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు, పాల్గొన్నారు.



సాగర్ నీరు వదలడం అభినందనీయం

వెల్దుర్తి: నాగార్జున సాగర్ కుడికాలువకు 10 రోజులు నీటిని విడుదల చేయడం అభినందనీయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో వారు విలేకరులతో మాట్లాడారు. పల్నాటి ప్రాంత రైతుల వేసిన పంటలు చివరి దశలో ఉండడంతో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇరిగేషన్ శాఖా మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు కృష్ణదేవరాయలు పట్టుబట్టి నీటిని విడుదల చేయించడం సంతోషకరమన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులతో మాట్లాడి నాగార్జున సాగర్ కుడికాలువకు నీటి విడదల చేయించారు. సకాలంలో పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పరిమితికి మించితే చర్యలు తప్పవు

ఎస్ఐ అశోక్

గురజాల : పరిమితికి మించి ప్రయాణీలు ఎక్కించినా అధిక లోడ్ వేసిన అట్టి వారిపై చర్యలు తప్పవని ఎస్ఐలు అశోక్, బి ఆనంత కృష్ణలు సూచించారు. బస్టాండ్ ఏరియాలో ఆటో స్టాండ్ నందు ఆదివారం డ్రైవర్లుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు, ప్రజలు విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. ఆటోలు నడిపే సమయంలో పరిమితికి ప్రయాణీకులను ఎక్కించుకోరాదన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని అధిక స్పీడ్‌తో వెళ్లరాదన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

నేడు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: సాగర్ జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు ఆదివారం చెప్పారు. డీఈ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ఆరుతడి పంటలు కాపాడుకునేందుకు ఆరు టీఎంసీల విడుల చేస్తున్నట్టు వివరించారు. గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1.000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వివరించారు. తాగునీటి అవసరాలతోపాటు ఆరుతడి వంటల సంరక్షణ కోసం సాగర్ జలాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్త కుండా ఉండటానికి ఆయా గ్రామాల పరిధిలోని రక్షిత మంచినీటి చెరువులు, వాగులు, కుంటలు తదితరాలన్నీ నింపుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారం రోజులు మాత్రమే సాగర్ జలాలు విడుదల చేస్తామని తదుపరి నిలుపుదల చేస్తామన్నారు.

నాడు శిథిలం.. నేడు ఘనం



నాడు శిథిలావస్థలో హైస్కూల్ ..



నేడు ఆధునికీకరణ చేసిన తరువాత హైస్కూల్ భవనం

దాచేపల్లి : దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధునికీకరణ అదరహో అనిపించింది. హైస్కూల్ అభివృద్ధిలో ప్రభుత్వం తోడ్పాటు అందించడంతో పాటుగా పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడంతో అందంగా రూపుదిద్దుకుంది. హైస్కూల్‌లోని ఉపాధ్యాయుల కార్యాలయం భవనాన్ని పూర్వ విద్యార్థులు రూ. 25లక్షలతో ఆధునికీకరణ చేయడంతో నాడు శిథిలావస్థలో ఉన్న భవనం నేడు కొత్తదనం సంతరించుకుంది. కార్యాలయం పై కప్పును పూర్తిగా తొలగించి కొత్తగా తయారు చేసిన పెంకులు అమర్చారు. కార్యాలయం భవనాన్ని ఆధునికీకరణ చేసి రంగులు వేశారు. ఈ నెల 19వ తేదీన ఆదునికీకరణ చేసిన భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల కృషిని విద్యార్థులతో పాటుగా ప్రజలు అభినందిస్తున్నారు.

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతి పురాతనమైన నాగేంద్రస్వామి వారి దేవస్థానంలో వెలసిన శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు అప్పయ్యస్వామి, రామరాజు కేశవరావు నేతృత్వంలో వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్శిరెడ్డి స్వామివార్ల వద్ద ప్రత్యేక పేజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు మహాన్నదానం చేశారు. తిరునాళ్ల సందర్భంగా గోలి, జెట్టిపాలెం, పశర్లపాడు, రెంటచింతల గ్రామాలకు చెందిన భక్తులు కుంకుమ బండ్లు కట్టి గ్రామంలో మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ గ్రామోత్సం నిర్వహించి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ఆవరణలో నున్న రాతి, జీవ ధ్వజస్తంభాలు వద్ద భక్తులు చేపట్టిన ప్రత్యేక పూజలతో ఆ ప్రాంతమంతా భక్తి భావం వెల్లివిరిసింది. ఆలయ ప్రధాన ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కొండా రామయ్య, ఆవుల వెంకటరెడ్డి, చట్టా శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గోలి గ్రామ శివార్లో పూజలు అందుకుంటున్న నీలంపాటి అమ్మవారు

వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

రెంటచింతల: రెంటచింతలలోని బ్రహ్మయ్య బావి సెంటర్లో వేంచేసి ఉన్న విఘ్నేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి, షిరిడి సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, నాభిశిల వార్ల మందిరం 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఘండికోట విజయమోహన్ కుమార్ శర్మ నేతృత్వంలో పలువురు అర్చకులు ఉదయం 7గం.లకు నాభిశిలకు వేదస్వస్తి, ఉదయం 8గం.లకు శ్రీ విఘ్నేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, శ్రీ వెంకటేశ్వరస్వామి వార్లకు పంచామృత అభిషేకాలు, శ్రీ అభయాంజనేయ స్వామి వారికి సహస్ర నామార్చన, ఉదయం 10 గం.లకు సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మందిరంలో వేంచేసిన స్వామివార్లకు వందలాదిమంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు అన్నదానం చేపట్టారు. మందిరాన్ని వివిధ రకాల పూలతో, రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.



ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన స్వామివార్లు

భానుడు ..భగ భగ

- 40-42 డిగ్రీలు నమోదు
- అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు

గురజాల : పల్నాడు ప్రాంతం అంటే వేడికి పెట్టింది పేరు. వేసవి కాలంలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. గత కొన్ని రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు జరుగుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఎండ తీవ్రత అత్యధికంగా ఉందనే చెప్పవచ్చు. ఉదయం పది గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉక్కపోతతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోజు రోజుకు వేసవి తాపం పెరుగుతుంది. గత కొద్దిరోజులు నిప్పుల వాన కురుస్తోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల వరకు నమోదు జరుగుతున్నాయి. 41.2, 42.1, 42.6, 42.5, 42 ఈ విధంగా గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు నమోదు జరుగుతున్నాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ప్రజలు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రతకు గురై వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం తద్వారా నీటి శాతం కోల్పోవడం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు.

ఎండవేడికి విలవిల...

రోజు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు జనం విలవిలలాడుతున్నారు. ఉక్కపోత మరొక్క పక్క వేడి గాలులకు ఉక్కిరిబిక్కిరిఅవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కూడా వేడి గాలులు వీస్తున్నాయి. ఎండవేడిమికి తట్టుకోలేక చల్లటి పదార్థాలు సేవించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు...

ఎండ దెబ్బకు శరీరంలోని లవణాలు తగ్గిపోవడం , లేక శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోవడం జరుగుతుంది. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు చెమట రూపంలో అధికంగా నీరు ఎక్కువగా పోతుంది. ముఖ్యంగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులు గర్భిణులు, బాలింతలు, బీపీ ఉన్న వారు వడదెబ్బకు ఎక్కువగా గురవుతారు. వడదెబ్బ తగిలిన సమయంలో విపరీతమైన తలనొప్పి, తల తిరగడం ,తీవ్రంగా జ్వరం కలిగి ఉండడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటివి జరుగుతాయి.

తీసుకోవల్సిన జాగ్రత్తలు

అవసరం ఉండి బయటకు వస్తే తప్పనిసరిగా గొడుగు లేదా టోపీని ధరించాలి. తెలుపు రంగు పలుచటి దుస్తులు ధరించాలి.శరీరానికి వేడి గాలులు తగలకుండా జాగ్రత్తలు చూసుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో శరీరం అలిసిపోయే విదంగా పనులు చేయరాదు. వేసవి కాలంలో అత్యధికంగా మజ్జిగ, నిమ్మరసం, నీరు తీసుకోవాలి.



నిర్మానుష్యంగా మారిన బస్టాండ్ ఏరియా

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ సోకిన వ్యక్తిని వెంటనే నీడ కలిగిన ప్రదేశానికి తరలించాలి. తడి గుడ్డతో శరీరం అంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చేస్తుండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం లేదా రీ హైడ్రేషన్ ద్రావణం తాగించాలి. అవసరం అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. స్వతహాగా వైద్యం పనికి రాదు.

– పద్మావతి, మాడుగుల వైద్యాధికారిణి

రైతు భరోసాకు 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

శావల్యాపురం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబధించి రైతుభరోసా పథకం సాయం కోసం ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) రామినేని రామారావు ఆదివారం తెలిపారు. ఏవో మాట్లాడుతూ కొత్తగా పొలాలు కొనుగోలు చేసిన వారు, వారసత్వంగా పొలాలు రిజిస్టర్ చేసుకున్నవారు, ఇప్పటివరకు రైతుభరోసా వర్తించని వారు ఈనెల 30లోగా ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు జిరాక్స్‌లతో సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.